# తెగింపు

రాజేశ్వరికి బాధగా ఉంది. ఇప్పుడు కాదు, ఈరోజు కాదు నిన్నా కాదు, రేపూ కాదు. పెళ్లయిందగ్గర్నుండీను. అంటే మూడేళ్లయి బాధపడని రోజులేదు. క్షణం లేదు.

ఏ ముహూర్తాన అయ్యిందో పెళ్లి! ఆ ముహూర్తానే పేచీ. మామూలే. కట్నం పేచీ. లాంఛనాల పేచీ. పీటల మీద కూర్చున్న ఆడకూతురి వూసే లేదు. ధ్యాసే లేదు.

"పదివేలు కట్నానికొప్పుకున్నాం. ఆడపడుచుకట్నం వెయ్యి. పిల్లడికి ఉంగరం, వాచీ సరేసరి. మరిప్పుడు అయిదు వేలు చేతిలో పెట్టి తర్వాతిస్తానంటారేం ..." వియ్యపురాలు నిగ్గదీసింది. ఇదగో శ్రీవారు ప్రభాకరం గారున్నారా .... వారి తల్లి కమలమ్మ.

పోనీ తండ్రి సబబుగా మాట్లాడేడా. ఊహు.

"అవున్నిజవే. మిగతాది సర్దుబాటు కాలేదు. తర్వాతిస్తానని బతిమాలుకున్నాగా. అయినా పిల్లకి నాలుగు తులాల బంగారం పెడ్తానని చెప్పి మీరు రెండు తులాలే పెట్టలేదూ... మీలాగా నిగ్గదీసేనా..."

"మాతో మీకు పోలికా..."

"ఆడపిల్ల తండ్రినని కాదూ అలుసు"

"అవునని వేరే చెప్పాలా..."

"మీకూ ఉన్నారు ఆడపిల్లలు...."

"ఉంటే?".

పెద్ద మనుషులు జోక్యం చేసుకున్నారు. ఇలా కాపరం సాగుతోంది.

కథా నిలయం
3632
శ్రీకాకుళం

గతుకుల రోడ్డుమీద అతుకుల బండిలాగ. మూడేళ్ళుగా సాగుతోంది. ఏడాది పిల్లడు కూడాను. అయినా నిత్యమూ పేచీలే.

"ఏ కూర చేసేది?" అనడిగితే తప్పు. "ఏవున్నాయ్ మీ నాన్న తెచ్చిపడేసినవి. ఉన్నవి ఆ పుచ్చొంకాయలొక్కటేగా. అవే తగలేయ్."

అడక్కుండా చేస్తేనో. అదంతకన్నా రాద్ధాంతం "మా యిష్టాయిష్టాలక్కర్లేదా ఏం పెడితే అదే తినాలనా నీ ఉద్దేశం?" అంటారు.

ఇక పండక్కీ పబ్బానికీ ఉండనే వుంది రగడ.

"ఈ పండక్కయినా బాకీ చెల్లేస్తాడా మీ నాన్న?"

"వడ్డీ సంగతి దేవుడెరుగు, అసలైనా ఇస్తే చాలు..."

"మిగిలిన అయిదు వేలూ పడేయమను. పండగ కట్నానికో నమస్కారం"

ఇలా రుయ్ రుయ్‌మని పోతోంటే తనేం చేస్తుంది? ఏం చెప్తుంది? అటు చూస్తే.....

"ఏం పారిపోతానా... ఎంతసేపూ డబ్బు డబ్బంటాడు మీ ఆయన......

సమయం సందర్భం లేదూ, పండక్కొచ్చి సరదాగా గడపకుండా....

అయినా నన్నడగొచ్చుకదా..."

-ఇదీ నాన్న వరుస.

అటో కుక్క. ఇటో కుక్క. తనని పీకి ముక్కలు చేస్తున్నాయ్. తను నోరు విప్పితే పది తప్పులు ఎత్తి చూపిస్తారు. నోరు విప్పకపోతే ఒక్కటే తప్పు... బెల్లం కొట్టిన రాయిలా మాట్లాడదని.

అదే ఉత్తమం.

ఇప్పుడిదిగో ఇన్‌లాండ్ కవరు. అడ్రసు కూడా రాసేసి ముఖం మీద విసిరేసేరు. అయ్యగారాఫీసుకు వేంచేసేరు. వచ్చేలోగా రాసేయాలట. నాన్నకి,

కట్నం డబ్బు పంపించు అని. అదీ శాసనం. రాస్తున్నదీ లేనిదీ కమలమ్మ గారి అజమాయిషీ.

నాన్న ఇబ్బందులు తనకి తెలుసు. అలా అన్చెప్పి మూడేళ్లుగా ఒప్పుకున్న డబ్బు ముట్టచెప్పకపోవడం, అదీ సమర్థించలేదు. పోనీ ఫలానా అప్పుడిచ్చేస్తానని ఖచ్చితంగా చెప్పాలి, ఇవ్వాలి. అదీ లేదు. ముంచడూ తేల్చడు.

పోనీ ప్రభాకరం ఓరోజు సెలవు పెట్టి వెళ్లి నాన్నతో అమీ తుమీ తేల్చుకోకూడదూ? ఊహు. నామోషి. తనని సాధిస్తారు. పండక్కి వెళ్లినప్పుడైనా తేల్చుకోవాలా? అబ్బే, సుబ్బరంగా మెక్కడం, ఒకవేళ సందర్భం వచ్చినా కుక్కల్లా కాట్లాడుకోవడం.

ఎలా చచ్చేది?

అవును. చావాలి. అప్పుడే తనకి విముక్తి.

కిరసనాయులు పోసుకుని కాల్చేసుకుంటే తనని తగలెట్టే ఖర్చయినా జమ అవుతుంది. లాభం గూబల్లోకి రావాలి. తన చావుకి కారణం ప్రభాకరం, కమలమ్మా అని చీటీ రాసి పెట్టేస్తే. అంతే కావాలి. చచ్చి సాధించొచ్చు. కాని, మంటలు, అమ్మో బాధ. కనీసం అరగంటైనామంటల్లో మాడితేనేగాని చావురాదేమో. అన్నంగిన్నె ముట్టుకుని కాలితేనే బొబ్బలెక్కిపోతుంది. అరగంట మంటలు, అబ్బ. తల్చుకుంటేనే ఒళ్లు గగుర్పాటు. వద్దు బాబూ.

నూతిలో దూకేస్తేనో. అవును. ఆ నూతి నీళ్ళు వాడిక్కి, పూజకి పనికి రాకుండాపోతే కమలమ్మగారి ముఖం చూడాలి. ఆ ముఖం మాటకేం. తనెలా వుంటుంది? శవం ఉబ్బిపోయి. వికారంగా. గబ్బు కంపు. నీళ్ళలో పడగానే చావొస్తుందా? పావు గంటైనా కష్టపడాలేమో? ముక్కులోకీ, నోట్లోకీ నీళ్లుపోతూ.. కాళ్ళకి నేలదొరక్కుండా... కళ్లకేం కనిపించకుండా... గాభరాగా... ఉక్కిరిబిక్కిరిగా.... అబ్బ... ఇప్పుడే ఊపిరి సలపడం లేదు.

బలవంతపు చావు చావడం చచ్చేచావు బాబూ. అర క్షణంలో చచ్చే మార్గం వుంటే తప్ప చావలేదు తను. లేదూ, నీళ్లు పెట్టే హింసలు అనుభవించాలి.

కేకలు.

పక్కవాటాలోంచి. ఎవరూ. వనజా, వాళ్లాయనా. వనజకు కేకలేయడం కూడా వచ్చునే! మాట్లాడ్డమే అపురూపం.

తను వారపత్రికిస్తుంది. వనజ పేపరిస్తుంది. విశేషాలు మాట్లాడుకోవచ్చుగా. సీరియలు కథ ఎలా వుందీ చెప్పొచ్చుగా. ఊహు. తను చెప్తే వినడమే. ఏవైనా అడిగితే చిన్న నవ్వు. లేకపోతే 'ఔను, కాదు.'- అంతే.

అవును వనజ గొంతే!

"ఇంకెక్కడి బాకీ... ఎప్పుడో చెల్లయింది..."

ఇంతకు మునుపు తను విన్నదే. ఎదురింటావిడ కమలమ్మతో చెప్పలేదూ. ఎంత ఘోరవమ్మా అని ఈ కమలమ్మే నోరు నొక్కుకుంది కూడాను.

"నన్నుభవిస్తున్నందుకు రోజుకు పదిరూపాయల చొప్పున లెక్క కడితే మీ బాకీ ఎప్పుడో జమయిపోయింది. నా తిండి ఖర్చుకీ, మీ ఇంటిచాకిరీకి చెల్లు".

అబ్బ ఎలా మాట్లాడుతోంది?

"ఇలాంటి డైలాగులు నాకు చెప్పకు. వడ్డీ ఎవడిస్తాడే..".

"ఓహో మీకంతా క్యాష్ బేరాలే కావాలి కదూ. నా ఒళ్ళు రోజువారీ ఎవడికైనా తాకట్టుపెట్టుకుని మరోపది ఎక్కువ జమచేసుకోండి..."

"ఛీ... సిగ్గులేని..."

"ఆపండి. ఆడాళ్లకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోబట్టి... ఆ మాట అనవలసి వచ్చింది. మీ డబ్బు కాపీనం చూస్తుండబట్టి అలా అన్నాను".

ఎంత తెగేసి చెప్పింది వనజ? ఇప్పుడు వాళ్లాయన వనజని తన్ని తగలేస్తే ఏం చేస్తుంది? రోజా వాతలు పెట్టి హింసలపాలు చేస్తే కూడా ఇలాగే మాట్లాడగలదా? బయటపడి బతకగలదా?

రాజేశ్వరి మనసులో ప్రశ్నలు ప్రశ్నలు.

అనుమానాలు అనవసరం. ప్రశ్నలు దండగ. భవిష్యత్తు అప్రస్తుతం. ఫలితం ఏమైతేనేం? వనజ ఎదిరించిన తీరుకు అభినందించాలి. ఆ ఎదురీతకి ప్రవాహమే ఝుడిసిపోవాలి. మనిషి అనగా ఎంత? తనకీ ఏదో మార్గం కనిపిస్తోంది. వనజని మనసులో మెచ్చుకుంది రాజేశ్వరి.

*(ఆంధ్రసచిత్రవారపత్రిక, 13-19నవంబరు '87)*